క్లుప్తంగా

ఎంపీడీవోగా బాపన్నదొర బాధ్యతల స్వీకరణ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: వై.రామవరం నూతన ఎంపీడీవోగా శనివారం కె.బాపన్నదొర బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన రవికిషోర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా ఉన్నతాధికారులు బాపన్నదొరను ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.తాతబ్బాయిదొర, పంచాయతీ కార్యదర్శి మధుసూదనరాజు, కోట పంచాయతీ కార్యదర్శి లోవరాజు తదితరులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి, పారదర్శకతతో విధులు నిర్వహణ, మండల ప్రజలకు మెరుగైన సేవలందించడం తదితర అంశాలపై సలహాలు సూచనలు ఇచ్చారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

మారేడుమిల్లి : మండలంలోని పందిరిమామిడి కోట గ్రామంలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మాతృశ్రీ గంగాలమ్మ తల్లి క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారంతో ముగిసింది. ఈ నెల 5న ఈ టోర్నమెంట్‌ని ప్రారంభించారు. టోర్నీలో మొత్తం 26 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో పూజారి పాకలు, బొడ్లంక జట్లు తలపడగా బొడ్లంక జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి ప్రకటించిన రూ.పది వేలు నగదును నిర్వాహకులు అందజేశారు. ఎంపీటీసీ సభ్యురాలు సాదల బున్నమ్మ, చావడికోట సర్పంచ్ ప్రేమ్‌కుమార్ రెడ్డి, మారేడుమిల్లి ఉప సర్పంచ్ బోడ్డేటి వీరబాబు, టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజ్ కుమార్ రెడ్డి, కత్తుల కుమార్, వరప్రసాద్ రెడ్డి, రేవుల రామకృష్ణారెడ్డి, జానకిరెడ్డి, శేషు కుమార్, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

35 మందికి వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో శనివారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ అరవింత్ శిబిరంలో 35 మందికి వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేసి అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. క్షయ రోగ నివారణలో భాగంగా గ్రామంలోని 40 సంవత్సరాలు వయస్సు నిండిన 20 మందికి బీసీజీ టీకాలు వేసినట్టు డాక్టర్ అరవింత్ తెలిపారు.ఏఎస్‌ఎం భవానీ, హెచ్‌వి లక్ష్మణ్, హెల్త్ అసిస్టెంట్ నానిబాబు, హెచ్‌సీ సుధాకర్, ఆశ రత్నం, 104 డీఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలి


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

అరకులోయ రూరల్: మండలంలో సుంకరమెట్ట పంచాయతీ పిరిబంధ పీవీటీజీ మోడల్ కాలనీలో మౌలిక సదుపాయలు కలిప్పించాలని సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు ఆధ్వర్యంలో స్థానికులు శనివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కాలనీలో కనీస సదుపాయాలు సక్రమంగా లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలనీలో విద్యుత్, డ్రైనేజీలు, రహదారి, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల పనులను పూర్తి స్థాయిలో కల్పించాలన్నారు. గ్రామస్తులు సొంబ్ర,లైలా, సుందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ ఫీ‘వర్రీ’


గిరిజన గ్రామంలో వెద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

- గ్రామాల్లో వైద్య శిబిరాలు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అనంతగిరి: ప్రస్తుతం వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఆస్పత్రుల వద్ద నిత్యం రోగులు సంఖ్య అధికంగా కన్పిస్తుంది. వాతవరణంలోని మార్పులు, చలిగాలుల వల్ల చిన్నారుల నుంచి వృద్ధుల వరకు జ్వరాలు, ఇతరత్రా రోగాల బారిన పడుతున్నారు. దోమల కారణంగా డెంగ్యూ,, మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఈ నేపథ్యంలోని వైద్యశాఖ అప్రమత్తమై తగిన జాగ్రత్తలు చేపడుతున్నారు. మండలంలోని పినకోట, భీమవరం, అనంతగిరి, లంగుపర్తి పీహెచ్‌సీ పరిధిలో గల పినకోట, పెదకోట, జాలడ,కుడియా,బూరుగు, చినకోనెల గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో పాటు జ్వరపీడితులున్నట్టు తెలుసుకొని వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తున్నారు. గిరిజనులకు ఆహారం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత తదితర విషయాలపై సూచనలు, సలహాలను ఇచ్చారు. అలాగే వైద్యశిబిరాలను నిర్వహించారు. గ్రామస్తులందరికీ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

వ్యాధులపై అవగాహన

‘గ్రామాల్లో జ్వరాలు ఉంటే వెంటనే వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధు లపై అప్రమత్తంగా ఉండాలని, దోమతెరలను తప్పనిసరిగా వాడాలని సూచిస్తున్నాం. వ్యక్తిగత ఆరోగ్య ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాం. కలుషితమైన నీటిని సేవించవద్దని, కాచి చల్లార్చిన నీటిని సేవించాలి. అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలు పొందాలి.

– జ్ఞానేశ్వరీ, వైద్యాధికారి, అనంతగిరి పీహెచ్‌సీ

గ్రామస్తులకు సూచనలు, సలహాలు

డెంగ్యూ, మలేరియా, జ్వరాలపై ఇప్పటికే వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూడడం, బ్లీచింగ్ చల్లించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. దోమతెరలు వినియోగించాలని, నిల్వ ఆహారం తీసుకోవద్దని, కాచిన నీరు తాగాలని వైద్య సిబ్బంది గ్రామస్తులకు సూచనలిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇళ్ల పరిసరాలు, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వలేకుండా చూడాలి
- వాడకం నీరు ఎప్పటికప్పుడు బయటకు వెళ్లే మార్గం ఏర్పాటు చేసుకోవాలి
- ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు, రుబ్బురోళ్లు, కూలర్లు, తొట్టెలు తదితర ప్రాంతాల్లో నిల్వ నీరు ఉంటే దోమలు చేరే అవకాశం ఉంటుంది.
- ఇంటి కీటికిలు, తలుపులు మూసివేయాలి
- ప్రతి ఇంటిలో దోమతెరలు వినియోగించాలి.

గ్రామాల్లో ముమ్మరంగా స్ప్రేయింగ్ పనులు


స్ప్రేయింగ్ పనులు చేస్తున్న సిబ్బంది

వై.రామవరం: మండలంలో మలేరియ నిర్మూలనకు డీఎల్‌పీవో ఆదేశాల మేరకు ఈవోపీఆర్‌డీ శివకుమార్ పర్యవేక్షణలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు పంచాయతీ కార్యదర్శి మధుసూధనరాజు తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన వై.రామవరంలో యాంటీ లార్వా స్ప్రేయింగ్ పనులు ప్రారంభించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామంలోని నీటి నిల్వలు ఉండే ప్రదేశాల్లోను, మురుగు గుంటల్లోను, డ్రైనేజీల్లోను యాంటిలార్వా లిక్విడ్‌ను స్ప్రేయింగ్ చేశారు. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లోను స్ప్రేయింగ్ ప్రారంభించినట్టు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో హోమం


శివసాయి ఆశ్రమంలో రుద్రహోమంలో పాల్గొన్న భక్తులు

వై.రామవరం: లోక కల్యాణం కోసమే ఆలయ ప్రాంగణంలో దైవ కార్యక్రమాలు నిర్వహి స్తున్నామని సాయిరాం గురుస్వామి అన్నారు. మండల సరిహద్దు గ్రామం వెదురునగరంలోని శివసాయి భువనేశ్వరి అశ్రమ దేవాలయాల ప్రాంగణంలో నిర్వాహకులు శ్రీసాయిరామ్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం భక్తిశ్రద్ధలతో రుద్రహోమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి మైదాన ప్రాంతం నుంచి వందలాది మంది భక్తులు వచ్చారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. పలువురు వేద పండితులు, మైదాన ప్రాంత భక్తులు, పలువురు దాతలు సహాయ సహకారాలు అందించారని, వారందరికీ శివసాయిల ఆశిస్సులు ఉంటాయని సాయిరామ్ గురుస్వామి అన్నారు. వారికి ఆయన అభినందనలు తెలిపారు.

పాఠశాలల్లో మెనూ తప్పనిసరి


చెరకుంపాకలు పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లిరూరల్: మండలంలో అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం అందించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని తహసీల్దార్ టి.రామకృష్ణ అన్నారు.మండలంలో చెరకుంపాకలులోని ఉన్న ఎంపీయూపీ పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సక్రమంగా పాఠశాల అధికారులు, సిబ్బంది అమలు చేసి విద్యార్థుల్లో పోషకాహర లోపం లేకుండా చూడాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు అడిగారు. పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెంచేలా ఉపాధ్యాయులు పలు కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

ఘనంగా రాధాకృష్ణుల తీర్థం


రాధాకృష్ణులను దర్శించుకుంటున్న భక్తులు


ఆలయం వద్ద మహిళల కోలాటం

మాడుగుల రూరల్: కె.జె.పురం –దబ్బకుంటు రహదారిలో రాపేట వారి కళ్లాల వద్ద రాధాకృష్ణుల తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు ఎం. కోటపాడు, వల్లాపురం, వంటర్లపాలెం, ఘాట్‌రోడ్డు, తదితర చోట్ల నుంచి వచ్చిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మహిళల కోలాటం ఆకట్టుకుంది. సాయంత్రం వర్షం కురవడం వల్ల ఎడ్ల పరుగు పోటీలు రద్దు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటలకు ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, అక్షింతలు, శేషవస్త్రాలు అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి 1001 నామాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. ఉభయాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

రంపచోడవరం: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డి.రవి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల కోసం కళాశాలలో ప్రత్యేకంగా ఒక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.తమ కళాశాలలో బీఏ హిస్టరీ, పోలిటికల్ సైన్స్, బీఏ ఎకానమిక్స్, పొలిటికల్ సైన్స్, బీఏ కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీలోని జువాలజీ, మ్యాథ్స్, కెమిస్ట్రీ, బోటనీ తదితర కోర్సుల్లో 260 సీట్లు ఖాళీ ఉన్నట్టు పేర్కొన్నారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా హాస్టల్ సదుపాయం ఉన్నట్టు తెలిపారు. గత రెండు సంవత్సరాల నుంచి కళాశాల నాక్ బి–గ్రేడ్ సాధించడంతో పాటు విద్యా ఫలితాల్లో, స్పోర్ట్స్‌లో ముందంజలో ఉందన్నారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులు అనేక సేవ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. అర్హులైన, ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

అధ్వానంగా డీఆర్ డిపో భవనం


చినలబుడులో డీఆర్ డిపో భవనం దుస్థితి

అరకులోయ రూరల్: మండలంలో చినలబుడు పంచాయతీ కేంద్రంలో ఉన్న డీఆర్ డిపో భవనం అధ్వానంగా మారింది. భవనం శిథిలావస్థకు చేరుకుందని, సరకులు నిల్వకు ఇబ్బందులు పడాల్సి వస్తోందని నిర్వాహకులు, స్థానికులు చెబుతున్నారు. వర్షం పడితే భవనం కారిపోతోందని బియ్యం, ఇతరత్రా సరకులు తడిసిపోయి పాడైపోతున్నాయని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డీఆర్ డిపో భవనానికి మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై డివిజనల్ మేనేజర్ సింహాచలం మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

రేపటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

కోటకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో ఈ నెల 17 నుంచి రెండు రోజులపాటు స్వామి వారి 7వ వార్షిక కల్యాణోత్సవాలను నిర్వహించడానికి సన్నాహాలు చేసినట్టు అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు జ్యేష్ట శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం 9 గంటలకు స్వామి వారికి అభిషేకం, విశేష అర్చన, సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించనున్నట్టు తెలిపారు.
ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, గోప అప్పలాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు గరుడ సేవ (తిరువీధి సేవ) జరపనున్నట్టు తెలిపారు.

మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళి

కోటకోట: మహాకవి శ్రీశ్రీకి శనివారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం(అనకాపల్లి)లో శ్రీ శ్రీ 41వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా ఎన్నో రచనలు చేశారన్నారు. ఆయన రచనలు శ్రమజీవుల గొంతుకగా మారాయని చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కండేపల్లి త్రినాథ్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధి వి.పోతురాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి, కార్యదర్శి జి. ఫణీంద్రకుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

నర్సీపట్నం: ఈ నెల 29వ తేదీన జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షియాజ్ ఖాన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మధుసూదన్‌రావు పోలీసు అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కోర్టులో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి అవకాశమన్నారు. ఈ విషయం కక్షదారుల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

విద్యా కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి


ఉపాధ్యాయులకు సూచలిస్తున్న ఎంఈవో శ్రీనివాసరావు


సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అడ్డతీగల: ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి విద్యా కార్యక్రమాలు నూరుశాతం సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలల్లో కొత్త విద్యార్థుల ప్రవేశాలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. విద్యా కానుక కిట్లను ప్రతి విద్యార్థికి అందించాలన్నారు. ఉపాధ్యాయులు అందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవ్వాలన్నారు. విద్యా ప్రవేశ్ యాప్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని సూచించారు. యుడైస్ ప్లస్, మ్యారీ లైఫ్ యాక్టివిటీస్ నిర్వహణ తప్పనిసరి అన్నారు. బడి బయట ఉన్న బాలలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా విద్యాబోధన సాగించాలన్నారు. పాఠశాలల్లో విద్యా బోధనకు విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరిసరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నాడు–నేడు పథకంలో పనులు పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. వివిధ విద్యా కార్యక్రమాలపై చర్చించి పాఠశాలల వారీగా వివరాలు నమోదు చేసుకున్నారు.

సందడిగా చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే


రాజవొమ్మంగిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో చిన్నారులతో తల్లిదండ్రులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని రాజవొమ్మంగి–4 అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే శనివారం సందడిగా జరిగింది. ఈ కేంద్రంలో రాజవొమ్మంగి–2, రాజవొమ్మంగి–4, బీసీ కాలనీ, రాజవొమ్మంగి–3 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు నిండిన 19 మంది పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు ఇచ్చామని ఇన్‌చార్జి సీడీపీవో అరుణలత తెలిపారు. వీరిని తల్లిదండ్రుల సమక్షంలో పై తరగతులకు ప్రమోట్ చేశామన్నారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని అవగాహన కల్పిస్తున్నామన్నారు. అదే విధంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు సంవత్సరాలు నిండిన వారికి అక్షరాభ్యాసం చేస్తున్నామన్నారు. సర్పంచ్ రమణి, అంగన్‌వాడీ టీచర్లు వెంకటరత్నం, రమణి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఉపాధి పనులు


బోడిగుడలో ఉపాధి పనులు


లివిటిపూట్‌లో భూమి చదును పనులు

దుంబ్రిగుడ (అరకులోయటౌన్): మండలంలోని పోతంగి గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. పంచాయతీ పరిధిలోని 36 గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు శెట్టి శాంతకుమారి, టి.డాలిమ్మల ఆధ్వర్యంలో టెర్రసింగ్, రాతికట్లు, భూమి చదును, బౌండరీ ట్రెంచ్ పనులు గత రెండు వారాలుగా జోరుగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఫీల్డు అసిస్టెంట్‌లు మాట్లాడుతూ తమ పంచాయతీ పరిధిలోని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు కల్పిస్తున్నామన్నారు. మండల ఏపీఓ, ఇతర అధికారుల సహకారంతో ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ రకాల పనులు చేయిస్తున్నట్టు చేయిస్తున్నట్టు వారు తెలిపారు. ఇందులో భాగంగా పోతంగి పంచాయతీ పరిధిలోని 1294 మంది జాబ్‌కార్డుదారులు, 2,890 మంది ఉపాధి కూలీలకు ఈ పనులు చేస్తున్నామన్నారు. స్థానిక గ్రామాల్లోనే పనులు కల్పించడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా



టైలరింగ్‌లో శిక్షణ పొందిన మహిళలు

ముంచంగిపుట్టు: సమాజంలో మహిళలు ఆర్థికంగా ఎదగాలని అప్పుడే కుటుంబానికి భరోసా కలుగుతుందని ఆదివాసీ మహిళ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు విజయ, ఈశ్వరి అన్నారు. మండల కేంద్రంలో విశాఖపట్నం రోటరీ క్లబ్ సంస్థ సహకారంతో ఆదివాసీ మహిళ సంఘం ఆధ్వర్యంలో రెండు నెలలుగా జరిగిన టైలరింగ్‌లో శిక్షణ శనివారంతో ముగిసింది. ఇందులో భాగంగా టైలరింగ్‌లో శిక్షణ పొందిన 57 మంది మహిళలకు సర్టిఫికెట్లును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని, స్వయం ఉపాధితో ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. ముంచంగిపుట్టులో రెండోవ విడతలో 151 మంది గిరిజన మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మహిళలను చైతన్యం పరుస్తూ ఇలాంటి మరెన్నో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రేనర్ మణి, గిరిజన మహిళలు , గ్రామస్తులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు


అంతర్ల ఆర్‌బీకేలో రైతులకు సూచనలిస్తున్న కల్పిస్తున్న ఏవో శ్రీనివాస్

చింతపల్లిరూరల్: పంటలు వేసినప్పుడు మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని చింతపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలో అంతర్ల, కందులగాధి గ్రామాలకు చెందిన గిరిజన రైతులతో శనివారం సమావేశం నిర్వహించి, వివిధ పంటల్లో అధిక లాభాలు, దిగుబడులు వచ్చేలా అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన వరిలో నూతన వంగడాలు, విత్తన శుద్ధి ,పచ్చిరొట్ట విత్తనాలు వినియోగం ,హైబ్రిడ్ విత్తనాలును కొనుగోలు చేసినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, పంట రుణాలు, పంట బీమా, ఈ పంట నమోదు తదితర విషయాలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఆర్‌బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.